ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 6 మే 2024



నారా లోకేశ్ పర్యటన రేపు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పేరిట నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7న విజయనగరం వస్తున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు అయోధ్యమైదానంలో సభ జరుగనుంది. లోకేశ్ పర్యటన ఏర్పాట్లకు సంబంధించి విజయనగరం కూటమి అభ్యర్థి అదితి గజపతి రాజు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులతో చర్చించారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్‌తో పాటు పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. ముఖ్యంగా యువతను ఆహ్వానిస్తున్నారు.

ఇదో భూముల బండారం

- బయట పడిపోయిన ఓ ఎమ్మెల్యే
- బినామీల పేర్లతో కొనుగోళ్లు
- చెల్లింపుల్లో రహస్యం
- ఎమ్మెల్యేను అడ్డుకున్న గ్రామస్థులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ దత్తిరాజేరు

అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే. మంత్రి సోదరుడు వివాదాస్పద భూములను కొనుగోలు చేస్తున్నట్లు కొన్నాళ్లుగా ఆరోపణలున్నాయి. వాటిని బినామీల పేర్లతో రిజిస్ట్రేషను చేసుకున్నట్లు కూడా సర్వత్రా ప్రచారంలో ఉంది. ఈ విషయం గ్రామస్థుల సమక్షంలో తాజాగా బయటపడిపోయింది. ఎమ్మెల్యేను గ్రామంలోకి రానీయకుండా అడ్డుకుని సమాధానం చెప్పాలని వారంతా పట్టుబట్టారు. దత్తిరాజేరు మండలంలోని ఆ గ్రామానికి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం కోసం శనివారం సాయంత్రం వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా ఎమ్మెల్యేను గ్రామంలోకి రానీయకుండా అడ్డుకున్నారు. చాలాసేపు గలాటా కొనసాగింది. గ్రామ పెద్దలు సర్దిచెప్పటంతో వివాదం సద్దుమణిగింది. ఈ సంఘటన జిల్లాలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. దీనికి దారితీసిన కారణాలను గ్రామస్థులే వివరించారు.

దత్తిరాజేరు మండలంలోని ఆ గ్రామంలో రామాలయం ఉంది. అదే గ్రామానికి చెందిన ఓ దాత 70ఏళ్ల క్రితం తనకు పిల్లలు(వారసులు) లేని కారణంగా భూమిని దేవాలయానికి దానం చేశారు. సర్వే నెంబరు 33, 27, 71 పరిధిలో ఉన్న 16 ఎకరాలను దేవుని మాన్యంగా ఇచ్చారు. పదిహేనేళ్ల క్రితం వరకు ఆ భూములను గ్రామంలోని రైతులకు వేలం ద్వారా కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని రామాలయ దూపదీప నైవేద్యాలకు వినియోగించేవారు. ఈ భూములు దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లిపోయే ప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్థులు అంతా ఏకమై గ్రామ పెద్దలుగా ఉన్న నలుగురు పేరున రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించారు. 1బీ వంటి హక్కులు కూడా వీరిపేరునే వచ్చాయి.

తరచూ వివాదాలు రావడంతో..

ఈ భూములపై తరుచూ గ్రామంలో సమస్యలు ఎదురయ్యేవి. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే అనుచరులు వివాదాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. భూములను ఎమ్మెల్యేకు అప్పగిస్తే ఆ సమస్య వారే చూసుకుంటారని ఆయన అనుచరులు గ్రామస్థుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఇలా జరిగిన చర్చలు ఫలితంగా తమపేరున భూములున్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు ఎమ్మెల్యే అనుచరులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుమారు కోటి రూపాయలకు 10.5 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు నిర్ణయించారు. ఆ ముగ్గురికి రిజిస్ట్రేషన్ సమయంలో కొంత మొత్తం చొప్పున చెల్లించి 2021లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. ఈ భూములను ఎమ్మెల్యే అనుచరుల కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన డబ్బులు గ్రామాభివృద్ధి కోసం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. కానీ మిగిలిన డబ్బులు ఎమ్మెల్యే అనుచరుల ద్వారా గ్రామస్థులకు అందలేదు. ఈ నేపథ్యంలో తమ గ్రామానికి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం కోసం వస్తున్నట్లు తెలుసుకున్నారు. గ్రామంలోకి వస్తున్న ఎమ్మెల్యే కారును శనివారం సాయంత్రం అడ్డుకున్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే అనుచరులు మాట్లాడుతూ చెల్లింపులు చేశామని చెప్పుకొచ్చారు. గ్రామస్థులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. తమకు తెలియకుండా రహస్యంగా చెల్లింపులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చివరికి గ్రామస్థులు, ఎమ్మెల్యే అనుచరులు చర్చలు జరిపి తాత్కాలికంగా వివాదాన్ని సద్దు మణిగించారు. ఈ భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే హస్తాం లేకపోతే నేరుగా ఆయననే ఎందుకు అడ్డుకుంటారు అన్న చర్చ అన్నిచోట్లా సాగుతోంది. వేరే వారు కొనుగోలు చేస్తే ఎమ్మెల్యేను ఎందుకు అడ్డుకుంటారని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఏదైనాగాని గుట్టుగా ఉన్న ఆయన భూముల విషయం ఇప్పుడు బయట ప్రపంచమంతా తిరుగుతోంది. ఇది ఎక్కడికి దారి తీస్తుందో చూడాలి.



ఎమ్మెల్యే అనుచరుల పేరున రిజిస్ట్రేషన్ జరిగినట్టు చెబుతున్న దేవుని మాన్యం భూములు ఇవే

మమ్మల్నే వెళ్లిపొమ్మంటారా?

- పోలీసులతో వైసీపీ నాయకుల వాగ్వాదం
- బొబ్బిలి ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద గొడవ
- ఆర్‌వో ఆదేశాలతో బయటకు వెళ్లిన శ్రేణులు

బొబ్బిలి, మే 5: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఆదివారం గొడవ జరిగింది. పోలీసులతో అధికార పార్టీ నాయకులు వాగ్వాదానికి దిగారు. సాధారణ పోలింగ్ రోజు నాటి పరిస్థితిని సృష్టించారు. ఉద్యోగులను ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు కలిసి ఓటు అడగడం కనిపించింది. కేంద్రం ముందు నిబంధనలకు విరుద్ధంగా రాజకీయపార్టీల నాయకులు అధికంగా కనిపించడంతో రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ సీరియస్ అయ్యారు. ఆమె ఆదేశంతో అక్కడ నుంచి అందరినీ పోలీసులు ఖాళీ చేయించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆదివారం నుంచి పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బొబ్బిలిలోని గొల్లపల్లి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు చేశారు. అయితే పరిశీలన పేరుతో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చారు. కొందరు ఉద్యోగుల వద్దకు వెళ్లి ఓటు అడిగారు. ఈ విషయం తెలిసి ప్రతిపక్షం నాయకులు కూడా అక్కడకు చేరుకున్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులను పేరుపేరునా అధికార పార్టీ నాయకులు పలకరిస్తూ ఫ్యాన్ గుర్తు మరిచిపోవద్దని కోరారు. సమయం గడిచేకొద్దీ అధికార పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తల సంఖ్య ఎక్కువైపోయింది. వారికి పోటీగా కూటమి నాయకులు, కార్యకర్తలు, ఇతర శ్రేణులు రావడంతో బొబ్బిలి-తెర్లాం రహదారిలో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. ఇది గమనించిన రిటర్నింగ్ అధికారి అయిన ఆర్డీఓ ఎ.సాయిశ్రీ అక్కడ నుంచి అందరినీ ఖాళీ చేయించాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి అందరినీ చెదరగొట్టారు. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కోరారు. దీనికి అధికారపార్టీ నాయకులు తట్టుకోలేక 'మమ్మల్నే వెళ్లిపోమంటారా?' అని పోలీసులతో గట్టిగా వాదించారు. నిబంధనల ప్రకారం కేంద్రం ఎవరూ ఉండరాదని, కేంద్రానికి వంద అడుగుల దూరంలో శిబిరాలను ఏర్పాటు చేసుకుంటే అభ్యంతరం లేదని చెప్పడంతో శాంతించారు. ఆ సమయంలో తెలుగుదేశం, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులైన బేబీనాయన, శంబంగి వెంకటచినఅప్పలనాయుడులు అక్కడ ఉన్నారు.

- రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ ఫెసిలిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆదివారం తొలుత పరిశీలించారు. ఎన్నికల నిర్వహణాధికారులు, సిబ్బంది నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కేంద్రంలో బొబ్బిలి పట్టణానికి, మండలానికి ఒక్కొక్కటి చొప్పున, అలాగే బాడంగి, రామభద్రపురం , బాడంగి మండలాలకు చెందిన ఓటర్ల కోసం ఒక్కొక్కటి చొప్పున పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 2,105 మంది ఉద్యోగులు ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు



పోస్టల్ బ్యాలెట్లు 4989

కలెక్టరేట్, మే 5: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఆదివారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ఉద్యోగులు క్యూ కట్టారు. అన్ని నియోజకవర్గాల్లో కలిపి 4989 మంది ఓటు వేశారు. ఇతర జిల్లాలకు చెందిన వారు 670 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. కాగా రాజాం నియోజకవర్గం నుంచి తొలిరోజు 746 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. చీపురుపల్లి నుంచి 385, గజపతినగరం(603), నెల్లిమర్ల(587), విజయనగరం (1356), బొబ్బిలి(749), ఎస్.కోట నుంచి 563 ఓట్లు వచ్చాయి.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

- 7,8 తేదీల్లో మరో అవకాశం
- రూ.450 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువుల సీజ్
- సున్నిత ప్రాంతాల్లో పటిష్ట నిఘా వ్యవస్థ
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



ఫెసిలిటేషన్ కేంద్రంలో సౌకర్యాలపై ముఖేష్‌కుమార్‌కు వివరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, మే 5: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, ఏమైనా ఇబ్బందులున్నవారు ఈనెల 7,8 తేదీల్లో కూడా ఓటు వేసే అవకాశం కల్పించామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రకటించారు. జిల్లాకు ఆదివారం వచ్చిన ఆయన జేఎన్‌టీయు గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఓటింగ్ ఏర్పాట్లు, హెల్ప్‌డెస్కులు, క్యూలెన్లు, పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఈవో మీడియాతో మాట్లాడుతూ పోస్టల్ ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు సైతం తమ ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును సంబంధిత ఫెసిలిటేషన్ సెంటర్‌కు తీసుకువెళ్లి ఓటు పొందవచ్చని చెప్పారు. ఇలాంటి వారికి ఈనెల 7,8 తేదీల్లో ఓటు వేయడానికి అవకాశం ఇస్తామన్నారు. అన్ని ఫెసిలిటేషన్ సెంటర్లలో కనీస సదుపాయాలు, హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వివిధ విభాగాల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని, సీ-విజిల్ ద్వారా ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకూ సుమారు 16000 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 99 శాతం చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్వయంగా తమ కార్యాలయానికే 500 ఫిర్యాదులు అందయని, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జోరుగా తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.450 కోట్లు విలువైన నగదు, మద్యం, విలువైన పరికరాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమ మద్యం రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు 12,400 సున్నిత , అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్, కేంద్ర బలగాలను వినియోగం, మైక్రో అబ్జర్వర్ల నియామకం పూర్తిచేశామన్నారు. ఇవే కాకుండా రాజకీయంగా సున్నితంగా ఉన్న 14 నియోజకవర్గాల్లో ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు అదనపు భద్రతా చర్యలు చేపట్టామని, వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎండ తగలకుండా చూస్తున్నామన్నారు. ఆయన వెంట కలెక్టర్ నాగలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్‌వో అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సందీప్ కుమార్ తదితరులు ఉన్నారు.



ఉద్యోగులకు సూచనలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా

శిల్పాలు లేని శిల్పారామం



తెలుగు సంస్కృతీసంప్రదాయాల్లో భాగమైన సంక్రాంతి.. ఉగాది.. అమ్మవార్ల పండగలు.. కూచిపూడి నృత్యం.. సంగీతం.. సాహిత్యం.. జానపద కళలు.. తొలకరిలో ఏరువాక సాగించే అన్నదాత.. తెలుగు వంటకాలు.. తోలు బొమ్మలాట.. బొబ్బిలి వీణ.. రాజుల వీరగాథలు.. ఇలా ఎన్నో.. వాటన్నింటినీ భవిష్యత్ తరాలకు అందించాలని.. శిల్పకళ ద్వారా శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేస్తే వాటిని చూసి అందరూ తెలుసుకుంటారని నాటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించి శిల్పారామాలను ఏర్పాటు చేసింది. అవి రూపు దిద్దుకుంటున్న దశలో ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఏర్పడడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చాక మూడేళ్లు పట్టించుకోవడం మానేసింది. గత ఏడాది హడావిడిగా ప్రారంభించి అసలు ఉద్దేశాన్నే పక్కదారి పట్టించింది. విజయనగరంలో శిల్పాలు లేని శిల్పారామాన్ని కొలువుదీర్చింది. దీనిని పార్కు అనడం సబబేమో అని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

- కానరాని తెలుగు సంప్రదాయ కళా ప్రదర్శనలు
- తెరవని స్టాళ్లు.. ఫుడ్ కోర్టులు
- స్థానికులు తప్ప ఇతరులెవరూ వెళ్లని దయనీయం
- పార్కు అనడమే సబబు అంటున్న జిల్లా ప్రజలు
- పండగల సమయాల్లోనే అధికారుల హడావిడి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

కనుమరుగవుతున్న తెలుగు సంప్రదాయాలను తట్టి లేపాలని.. వాటిని భవిష్యత్ తరాలకు అందించాలని.. గత ప్రభుత్వం శిల్పారామాలను తెరపైకి తీసుకురాగా ఈ ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టించింది. ఏమీ లేకుండా ఆర్భాటంగా ప్రారంభించి వదిలేసింది. కళలను భవిష్యత్ తరాలకు సజీవంగా అందించడం కోసం వారు ప్రయత్నిస్తే వీరు ప్రారంభించడమే పనిగా పెట్టుకుని మమ అనిపించేశారు. మన సంస్కృతీసాంప్రదాయల్లో అనేకం కనుమరుగవుతున్న దశలో ఉన్నాయి. వాటిని కాపాడి తర్వాత తరం వారికి పదిలంగా అందించడం అవసరం. ఈ విషయాన్ని వైసీపీ ప్రభుత్వం కనీసం గుర్తించలేదు. శిల్పారామాల కోసం టీడీపీ ప్రభుత్వం ఏకంగా పర్యటక శాఖలో ఒక ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసింది. మార్గదర్శకంగా వాటిని రూపుదిద్దాలని భావించింది. వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లు వదిలేసి గతేడాది జూన్‌లో శిల్పారామాన్ని ప్రారంభించింది. ఇక్కడున్న స్టాల్స్, కేంటీన్లు కొన్ని రోజుల్లో తెరవడం గగనమే. సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే స్టేజీ ఉంది కాని ప్రత్యేక పండగల్లోనే ప్రదర్శనలు ఉంటున్నాయి. పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం చెపుతోంది అందులో భాగమైన విజయగనరంలోని శిల్పారామాన్ని పట్టించుకోవడం లేదు. కల్చరల్ అండ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శిల్పారామం నడుస్తోంది. ఆదివారం మినహా అక్కడ జనాలు కన్పించడం లేదు. ఏ రోజూ స్టాళ్లు తెరవడం లేదు. అందులోకి ప్రవేశం కావాలంటే రూ.20 టిక్కెట్టు తీసుకోవాలి. లోపలకు వెళ్లాక చూడటానికి ఏమీ లేవు. సాధారణ పార్కు మాదిరి కాసేపు విశ్రమించి తిరుగుముఖం పట్టాల్సిందే. గత కలెక్టర్ సూర్యకుమారి శిల్పారామంలో వివిధ కార్యక్రమాల పేరుతో హడావిడి చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు ప్రయత్నించారు. దీంతో నిత్యం కొద్దిగా జనం కనిపించేవారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే చాలా దయనీయం. సమీపస్తులు మినహా ప్రత్యేకంగా శిల్పారామానికి వెళ్లేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. పిల్లలు ఆడుకునేందుకు మాత్రం కొద్దిగా పరికరాలు ఉన్నాయి. జ్యూయలరీ స్టాల్, టెర్రకోట్, ఏటికొప్పాక బొమ్మల దుకాణాలను తెరవడం లేదు. ఫుడ్ కోర్టు కూడా రోజూ తెరిచి ఉండడం లేదు.

- శిల్పారామం కోసం విజయనగరం పట్టణంలోని వ్యాసనారాయణ మెట్ట ప్రాంతంలో 41 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం కోటి రూపాయలతో వాటర్ పార్క్ నిర్మాణం జరుగుతోంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల కోసం స్టేజ్‌తో పాటు విశ్రాంతి గదులు ఉన్నాయి. వీటి నిర్వహణ సరిగా లేదు.ఇక్కడి పరిస్థితిని శిల్పారామం ఏఓ రమణ వద్ద ప్రస్తావించగా పర్యాటక శాఖ పరిధిలో ఓ సొసైటీ ఆధ్వర్యంలో శిల్పారామం నడుస్తోందన్నారు. ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, శిల్పాలు, సాంస్కృతిక కార్యక్రమాల కళా రూపాలు, జానపద కళలు, పల్లెటూరు వాతావరణం, గిరిజన మ్యూజియం, ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దశల వారీగా చేపట్టేందుకు ప్రణాళికలు ఉన్నాయని, వాటర్ పార్క్ నిర్మాణ దశలో ఉందని వెల్లడించారు.



నిర్మాణ పనుల కోసం తీసుకొచ్చిన ఇసుక నెలలుగా ఇలాగే..

పీపుల్స్ మేనిఫెస్టో

వ్యవసాయానికి సాయపడాలి



సాలూరు రూరల్: వ్యవసాయానికి ప్రభుత్వం సాయపడాలి. ఎన్నికల సమయంలో ప్రకటనలకే పరిమితం కాకూడదు. దుక్కి నుంచి పంట అమ్మకం వరకు ప్రభుత్వ పరంగా చేయూత నందించాలి. ఆరుగాలం కష్టించి పండించినా పరపతి ఉన్నవారికి ఒకలా, లేని వారికి మరోలా కొనుగోలు కేంద్రాలు వద్ద చూస్తున్నారు. రైతు అనే ప్రతి ఒక్కరికి సులభరీతిలో ప్రభుత్వం నుంచి చేయూత అందాలి. తద్వారా వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే వ్యవసాయంపై రైతులకు ఆసక్తి తగ్గిపోతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రానున్న తరానికి వ్యవసాయం ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకోవాలి.

- మర్రి రాము, రైతు, గుర్రప్పవలస

నువ్వెక్కడుంటే.. నేనక్కడుంటా..!

- చెరువులు, పొలాల్లో ప్రచారం
- ఓటర్ల ప్రాపకం కోసం అభ్యర్థుల పాట్లు

(చీపురుపల్లి)

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార జోరును పెంచారు. మరో ఐదు రోజుల్లో ప్రచారం కూడా నిలిపివేయాల్సి ఉండడంతో అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఎండలు అతి తీవ్ర రూపం దాల్చడాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రచార సమయాలను వాతావరణానికి అనుగుణంగా మార్చుకున్నారు. ఇప్పుడు ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం అంతటా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో, అధిక సంఖ్యలో ఉన్న వేతనదారులు, పొలం పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు, వ్యవసాయదారులను కలవడం కోసం చెరువులు, పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏ రోజు ఎక్కడ ఉపాధి పనులు జరుగుతున్నాయో తెలుసుకొని సంబంధిత గ్రామ నాయకులను తీసుకొని అభ్యర్థులు ప్రచారానికి బయలుదేరుతున్నారు. వేతనదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే.. ముందుగా ఉపాధి వేతనదారుల సమస్యలు పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. వలస ఓటర్లను గుర్తించి, సంఖ్యను బట్టి వారు నివాసం ఉండే ప్రాంతాలకు కొంతమంది అభ్యర్థులు తమ మనుషులను పంపించి మాట్లాడిస్తున్నారు. లేదా వారే స్వయంగా వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోతో పాటు తాము గెలిస్తే, వ్యక్తిగతంగా ఏదో ఒకటి చేస్తామని హామీ ఇస్తున్నారు. పోలింగ్ తేదీ నాటికి గ్రామానికి వచ్చి తమకు ఓటేయాల్సిందిగా ప్రాధేయపడుతున్నారు. ఎన్నికల్లో గెలిచి, అధికారం చేతికొచ్చాక, తమ అపాయింట్‌మెంట్ కోసం చుక్కలు చూపించే నాయకులు... ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓటర్ల అపాయింట్‌మెంట్ కోసం తహతహలాడడం విస్తుగొలుపుతోంది.



జన కేతనం
ఆంధ్రజ్యోతి
4 విజయనగరం
పార్వతీపురం మన్యం
సోమవారం 6 మే 2024
జిల్లాల వార్తలు

ఓటు పండగ మొదలైంది!

- ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్
- భారీ స్థాయిలో వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉండి ఓటు వేశారు. మరో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎస్.కోటలో 563 మంది..

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం 563 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గపరిధిలో 1776 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు టీడీపీ, వైసీపీ నేతలు ఫెసిలిటేషన్ సెంటర్‌ల వద్ద తిష్ట వేశారు. వైసీపీ నేతలు ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. కానీ వీరి ప్రలోభాలకు ఓటర్లు లొంగలేదు. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పోస్టల్ ఓట్ల సరళిని పరిశీలించేందుకు విశాఖ-అరుకు రోడ్డుకు ఓ వైపు కూర్చొని పరిశీలించారు.

రాజాంలో 746 ఓట్లు

రాజాం రూరల్, మే 5: రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ జరిగిన పోలింగ్‌లో ఉద్యోగవర్గాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజాం నియోజవర్గానికి సంబంధించి మొత్తం 1,741 మందికి గాను 746 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను పోలింగ్ కేంద్రంలోని హెల్ప్‌డెస్క్‌కే పరిమితం చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్‌తో పాటు రాజాం తహశీల్దార్ కృష్ణంరాజు పర్యవేక్షించారు. రాజాం టౌన్ సి.ఐ. దాడి మోహనరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాజాం: ఓటుహక్కు వినియోగించుకున్న మహిళా ఉద్యోగులు



విజయనగరంలో..



పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి నూకరాజు

తొలిరోజు 587 మంది..

నెల్లిమర్ల, మే 5: నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తొలి రోజు ఆదివారం 587 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1906 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పోల్ మేనేజ్‌మెంటు కోఆర్డినేటర్ సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, రెడ్డి వేణు, కాళ్ల రాజశేఖర్, బయిరెడ్డి కళ్యాణ్ తదితరులు హాజరయ్యారు. పోలింగ్ విధులకు హాజరు కానున్న ఉద్యోగులు 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని రిటర్నింగ్ అధికారి నూకరాజు తెలిపారు.



ఎస్.కోట: ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు



విజయనగరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

పథకాలను ప్రజలకు చేరువ చేస్తా

- మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం
- యువతకు ఉపాధి కల్పన..
- గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం
- పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి
- ఇవీ నా ముందు ఉన్న లక్ష్యాలు
- 'ఆంధ్రజ్యోతి'తో కురుపాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి

కొమరాడ: 'ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజలకు నరకాన్ని చూపించింది. ఒక్క అవకాశం అంటూ గద్దె నెక్కి... ఆపై జలగల్లా ప్రజలను పీడించారనే చెప్పాలి. ఎంత ఘోరమంటే ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటించి నిరుద్యోగ యువతను మోసం చేశారు. ఇక ఉద్యోగులకు పెట్టిన బాధలు వర్ణనాతీతమే. ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెప్పడం మరిచి యాప్‌లతో ఆపసోపాలు పడే పరిస్థితి తీసుకువచ్చారు. పాఠశాలలు విలీనం అంటూ విద్యకు ఉరి వేశారు. ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేమిటి అన్ని రంగాలను నాశనం చేశారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కురుపాం నియోజకవర్గ అభ్యర్థి తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. తనను గెలిపిస్తే చేపట్టబోయే పనులను..ప్రాధాన్య అంశాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

మహిళలను మహారాణుల్లా చూసుకుంటాం

తెలుగుదేశం ఆవిర్భావం నుంచి మహిళలకు అనేక రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నాం. చంద్రబాబు సీఎం కాగానే అమ్మకు వందనం, జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తాం. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు ఇస్తాం.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

జగన్ పాలనలో రాష్ట్రంలో పారిశ్రామికీకరణ కుంటుపడింది. ముఖ్యంగా మన్యం జిల్లాలో ఐదేళ్ల కాలంలో ఒక్క కుటీర పరిశ్రమ కూడా రాలేదు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ఉంది. ప్రత్యేక డీఎస్సీ లేకపోవడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో వారంతా గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లవలసి వస్తోంది. టీడీపీ అధికారంలో చేపట్టిన తరువాత నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి కల్పిస్తాం. గుమ్మలక్ష్మీపురం మండలంలో జీడి పిక్కల పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తాం. గిరిజనులకు అండగా ఉంటూ చట్టాలకు రక్షణ కల్పిస్తాం.

గిరి శిఖర గ్రామాలకు రహదారులు

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా రహదారి సౌకర్యం ఉండాలి. కురుపాం నియోజకవర్గంలో గిరి శిఖర గ్రామాలకు ముందుగా రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తా. ట్రైకార్ సేవలు పునరుద్ధరించే దిశగా చర్యలు చేపడతాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తాం. ట్రైకార్ ద్వారా రాయితీపై రుణాలు అందిస్తాం. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తాం.

గ్రామాల అభివృద్ధికి కృషి

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, రహదారులు, డ్రైన్ల నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరుస్తాం. వైసీపీ ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనను నిర్లక్ష్యం చేసింది. గిరిజన గ్రామాల్లో సౌర విద్యుత్ తాగునీటి పథకాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తి

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాగావళి నదిపై పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తికి చర్యలు చేపడతాం. ఇప్పటికే ఈ వంతెనను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులను పూర్తి చేసి 32 గిరిజన గ్రామాలకు రాకపోకలను సులభతరం చేస్తాం. గిరిజన గ్రామాల్లో గెడ్డలపై చెక్‌డ్యాముల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పించి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటాం.



కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి



విజయనగరం మండలంలో టీడీపీ శ్రేణులతో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పల్లెల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆదివారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. మక్కువ మండలంలో గుమ్మిడి సంధ్యారాణి, వీరఘట్టం మండలంలో కళా వెంకటరావు, జయకృష్ణ, డెంకాడ మండలంలో నాగమాధవి ప్రచారం చేశారు. కొమరాడ మండలంలో తోయక జగదీశ్వరి, సంతకవిటి మండలంలో కోండ్రు మురళి, విజయనగరం మండలంలో అదితి గజపతిరాజు తదితరులు పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం చేశారు..



వీరఘట్టం: బిటివాడలో మాట్లాడుతున్న చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు, పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ



బలిజిపేట: ప్రచారంలో విజయ సంకేతం చూపిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



మక్కువ: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సాలూరు టీడీపీ ఎమ్మెల్యే



సంతకవిటి మండలంలో కోండ్రు మురళి ప్రచారం



డెంకాడ: అభివాదం చేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి

మహిళల రక్షణకు పాటు పడే వారికే ఓటు



పాలకొండ: ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మహిళల రక్షణతో పాటు అన్ని రకాలుగా ప్రాధాన్య మిచ్చే వారికే నా తొలి ఓటు వేస్తాను. అభివృద్ధిపై దృష్టి సారించే పాలకులను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుంది.

- కె.భవానీ, పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వారికే..



పాలకొండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించే వారికే నా తొలి ఓటుతో ప్రాధాన్యమిస్తాను. ప్రస్తుతం రాష్ట్రంలో యువతీ యువకులు నిరుద్యోగంతో మగ్గిపోతున్నారు. **- కనపాక చంద్రశేఖర్, పాలకొండ**

సమస్యలు పరిష్కరించే నాయకుడికే..



గరుగుబిల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడు కావాలి. గ్రామాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి. గెలిచిన తరువాత ప్రజలను పట్టించుకోని స్థితిలో చాలామంది ఉన్నారు. వీరి బాటలో కాకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించి ప్రజల మన్ననలను పొందాలి.

- పి.మురళి, మరువెంట, గరుగుబిల్లి మండలం

యువగళం.. జనహితం



జీవితంలో తొలిసారి ఓటు వేసే రోజు ప్రతి ఒక్కరికీ మరపురాని అనుభూతి. ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేరు. నెత్తురు మండే.. శక్తులు నిండే యువత... నిస్వార్థం గా ఓటు వేస్తారనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారు ఎలాంటి వ్యక్తులను తమ నాయకులుగా ఎన్నుకోవాలనుకుంటున్నారో... ఎలాంటి సంక్షేమం కోరుకుంటున్నారో... చూద్దాం రండి.

- ఉపాధికి.. అభివృద్ధికే మా ఓటు
- దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించాలి
- తాత్కాలిక సాయాలు వద్దు
- ఇదీ కొత్త ఓటర్ల అభిప్రాయం

ఉపాధిని ఆశిస్తున్నాం...



గరుగుబిల్లి: యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. తొలిసారిగా ఓటు పొందినందుకు ఎప్పుడెప్పుడు ఓటు వేయాలా అని ఉంది. కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వం నుంచి విద్యా సౌకర్యాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు ఆశిస్తున్నాం. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుంటే ఉద్యమిస్తాం.

- కండేన సాహితి, సాంబన్నవలస

దార్శనికులకే ప్రాముఖ్యం



మెంటాడ: ఓటు బ్యాంకు రాజకీయాలు కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేసేవారు రావాలి. ముందుచూపుతో వ్యవహరించాలి. అభివృద్ధి, సంక్షేమం రెంటికీ సమ ప్రాధాన్యమివ్వాలి. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా దూర దృష్టితో ఉండాలి. శాంతిభద్రతలు కాపాడాలి. అలాంటి వారినే ఎన్నుకుంటాం. ఉచితాలు తగ్గించి.. ఆర్థిక వనరులు పెంపొందించే విజనరీ కావాలి.

- సీహెచ్ రంజిత్ కుమార్, పిట్టాడ

ఓటు హక్కు ఉన్న వారికి గౌరవం



బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఓటు హక్కు ఉన్నవారిందరికీ మంచి గౌరవం ఉంటుంది. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుకు ఇంత విలువ ఉంటుందనేది నాకు ఇప్పుడే తెలిసింది. నేను గుడ్డిగా ఎవరికీ ఓటు వేయబోను.చదువుకున్న యువతీ యువకులకు ఏ పార్టీ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న భరోసా ఉంటుందో ఆ పార్టీకే ఓటేస్తాను.

- మార్పు రమ్య, డిగ్రీ, ఇందిరమ్మకాలనీ, బొబ్బిలి

ప్రజలతో కలసి ఉండే వారికే...



రామభద్రపురం: నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. ఈసారి ఎన్నికల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడినే ఎన్నుకోవాలని అనుకుంటున్నాను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై దృష్టి సారించి అయిదేళ్లు ప్రజలతో కలిసుండే విధంగా నాయకుడు ఉండాలన్నది నా అభిమతం. ఇప్పటికీ పల్లెల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలి. ఎమ్మెల్యేగానీ, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేసే వారికి డిగ్రీ అర్హత ఉండాలనేది నా ఉద్దేశం.

- మామిడి రమేష్, ఆరికతోట

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వారికే..



పాలకొండ: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వారికి తొలి ఓటు వేస్తాను. తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆచితూచి యువత ఓటు వేయాలి.

- కోట జగదీష్, ఓని, పాలకొండ మండలం

నిజాయితీపరులకే తొలి ఓటు



సాలూరు రూరల్: నిజాయితీగా పాలించే వారికే నా తొలి ఓటు. తొలిసారిగా ఓటు హక్కు పొందడం ఆనందంగా ఉంది. రాష్ట్రం సత్వరం అభివృద్ధి చేసే నేతకు ఓటు వేస్తాను. రాష్ట్రం ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉంది. ఇందుకు సత్తా ఉన్న నేతను ఎన్నుకోవాలి. అందుకు నా తొలి ఓటును సమర్థులకే వేస్తాను.

- నులకల రాహుల్‌సాయి, సాలూరు

అభివృద్ధి చేసే వారికే...



సాలూరు రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే వారికే నా తొలి ఓటు వేస్తాను. రాష్ట్ర పరిస్థితి గురించి అవగాహన ఉంది. అందువల్ల నా తొలి ఓటు అభివృద్ధి కోసం వినియోగిస్తాను. ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకొని అభిప్రాయం చెప్పాలి. ఓటే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ.

- డబ్బి మురళీకృష్ణ, సాలూరు

అవినీతిని రూపుమాపే వారికే...



గరుగుబిల్లి: నా ఓటును నోటుకు అమ్ముకోను. మెరుగైన పాలన కావాలంటే ఓటు ద్వారానే సాధ్యమవుతుంది. పురోగతి సాధించాలంటే యువ నాయకత్వం కావాలి. అవినీతిని రూపుమాపే నాయకునికే ఓటు వేస్తాను.

- ఎ.శశికుమార్, గరుగుబిల్లి

పరిశ్రమలను ప్రోత్సహించాలి



మెంటాడ: యువత, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెంచాలి. పాలనలో జవాబుదారీతనం ఉండాలి. రాష్ట్రం అభివృద్ధి జరగాలి. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి. అలాంటి వారికే మా తొలి ఓటు.

- చప్ప గణేష్, పిట్టాడ గ్రామం

యువతకు మేలు చేసే వారికి...



పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నేను మొట్టమొదటిసారిగా ఓటు వచ్చిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి, పార్లమెంట్ నియోజకవర్గానికి ఓటు వేస్తున్నాను. ఆనందంగా ఉంది. యువతకు ఉపాధి కల్పించడం... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా పాలకులు ఉండాలి.

- టి.మణి, ఎల్ఎన్‌పురం, పార్వతీపురం

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే..



భోగాపురం: నేను మొదటిసారిగా ఓటు హక్కు ఉపయోగించుకుంటున్నందుకు ఏదో సాధిస్తున్నాం అన్నట్లుగా అనిపిస్తోంది. గ్రామానికి మంచి చేసేవారికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగించే వారికి ఓటు వేయాలనుకొంటున్నాను. ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు యువతకు ప్రదానం. ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు చూడాలి.

- ఎరుబోతు గణేష్, లింగాలవలస గ్రామం

పరిశ్రమలు తేచ్చే వారికే తొలి ఓటు



సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో ఎటువంటి పరిశ్రమలూ లేవు. నియోజకవర్గంలో పరిశ్రమలు తెచ్చే సమర్థత ఉన్నవారికే తొలి ఓటు వేస్తాను. నియోజకవర్గంలో వనరులు ఉన్నాయి. వాటితో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చొరవ చూపే నేతకు ఓటు వేయదలిచాను. అప్పుడు ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుంది.

- ఎన్.రాహుల్, సాలూరు

అభివృద్ధి చేయగల వారికే...



సాలూరు రూరల్: తొలి ఓటును సద్వినియోగం చేసుకోవాలి. తొలిసారిగా ఓటు రావడం ఉద్వేగంగా ఉంది. పరిస్థితులు అవగాహన చేసుకోవాలి. మనకు ఏ నేత వల్ల పనులు జరుగుతాయో గుర్తిస్తాను. ఎవరి వల్ల అభివృద్ధి జరుగుతుంతో వారికే ఓటు వేస్తాను.

- ఎన్.జీవన్, సాలూరు

ఉపాధికి ఊతమిచ్చే వారికే...



లక్కవరపుకోట: నాకు కొత్తగా ఓటు వచ్చినందుకు ఆనందంగా ఉంది. నా చదువుకు తగ్గట్టుగా ఫార్మా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ, ఉపాధితో రాష్ట్రాభివృద్ధి చేసేవారికే నేనే ఓటు వేస్తాను.

- ఎ.హారిక, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

ఉద్యోగాలు కల్పించే వారికి..



గుమ్మలక్ష్మీపురం: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంది. అటువంటి హామీలు ఇచ్చిన ప్రభుత్వాలను మేం ఎన్నుకుంటాం. యువతకు పథకాల వల్ల ఒరిగింది ఏమీ లేదు. వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలు జరిగినప్పుడే యువతకు మేలు జరుగుతుంది.

- ఎం.నీలిచంద్, డిగ్రీ, గుమ్మలక్ష్మీపురం

సమస్యలను పరిష్కరించగలిగే వారికే..



భామిని: యువత ఉపాధికి చేయూత అందించే నాయకునికే ఓటు వేయాలని మా లక్ష్యం. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించుకొనే నాయకుడే కావాలి. గ్రామ, మండల, నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి పరిష్కరించే విధంగా నాయకుడు చొరవ చూపగలగాలి.

- చీకటింటి ఝాన్సీ, బీటెక్ విద్యార్థిని, భామిని

గ్రామాభివృద్ధికి సహకరించే వారికి..



మక్కువ: కొత్తగా ఓటు వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఎన్నికల తేదీ వచ్చేంత వరకు ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు, అభివృద్ధి సంక్షేమంపై దృష్టిసారించాలి. యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలి. గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించాలి.

- గెంబలి ఆదిత్య, మక్కువ

ఓటు అమూల్యమైనది



బొబ్బిలి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో అమూల్యమైంది. మంచి నాయకులను గెలిపించుకోవాలి. కులం, మతం, ప్రాంతం, లింగ వివక్ష వంటి వాటిని రాజకీయాల్లో ప్రబలకుండా అందరూ అభ్యుదయం వైపే పయనించాలి. అలాంటి పార్టీలకు, నాయకులకే నేను నిర్భయంగా ఓటు వేస్తాను.

- పట్నాల శ్యామ్‌కుమార్, డిగ్రీ, బొబ్బిలి

దండాలయ్యా.. దండాలు

- పాదయాత్రలు... పలకరింపులు
- ప్రచారంలో తలమునకలు

(రాజాం రూరల్)

ఎండలు మండుతున్నాయి.. వేడిగాలులు హోరెత్తిస్తున్నాయి.. అదే సమయంలో ఎన్నికల వేడి కూడా ప్రజలను ఊపిరాడనివ్వడం లేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వస్తే... రెండో పూట మరో అభ్యర్థి.. ఇలా ఒకరి వెంట మరొకరు.. నాయకుల ప్రచారంతో ప్రజలు కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రచార రథాలకు అమర్చిన మైకులు హోరెత్తిస్తున్నాయి. అధికార, కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల వారూ ప్రస్తుతం ప్రచారంలో తలమునకలై ఉన్నారు. దండాలయ్యా. దండాలయ్యా. మాతోనే మీరు ఉండాలయ్యా అని ఓ సినిమాలోని పాటను ఎత్తుకుంటున్నారు.

సందడే సందడి..

చిన్న చిన్న గ్రామాలను ఉదయం పూట... పెద్ద గ్రామాలను సాయంత్రం వేళల్లో ప్రచారానికి ఎంచుకుంటున్నారు. ప్రచార రథాలపై వీధుల్లో తిరుగుతున్నారు. పట్టణాల్లోని వీధుల్లో పాదయాత్ర ద్వారా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

వ్యూహాల్లో తలమునకలు..

ఒక పార్టీపై మరో పార్టీ పైచేయి సాధించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వ్యూహాలు ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ... మరింత అభివృద్ధి తమ నేతతోనే సాధ్యమని... తమ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన వారైతే...తమకు ఓ అవకాశం ఇచ్చి చూడాలని కోరుతున్నారు.

పూజలు..

గ్రామాలకు వెళ్లినపుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. స్థానిక నాయకులు వారితో ఆలయాలలో పూజలు చేయించేందుకు ఎక్కువగా ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి..

ఓ వైపు తమ మేనిఫెస్టోలలోని అంశాలను ఏకరవు పెడుతూ...మరోవైపు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. మొత్తానికి ఈ దండాలు ఎవరికి వరమవుతాయో...ఎన్నికల ఫలితాలు వస్తేగానీ తెలియదు.



ఎమ్మెల్యే వచ్చేసరికి రాజీనామా చేయాల్సిందే!

- వలంటీర్లకు వైసీపీ నాయకుల హుకుం



రాజీనామా చేసిన లోట్లపల్లి పంచాయతీ వలంటీర్లు

జామి, మే 5: 'ఈ ఉద్యోగం మీరు చదివిన చదువు వల్ల మీకు రాలేదు.. మీరంతా ఈ ఉద్యోగం రాక ముందు వైసీపీ కార్యకర్తలు. జిల్లా అంతటా వలంటీర్లు రాజీనామాలు చేస్తుంటే... మీరు ఎన్నికలు సమీపిస్తున్నా... ఇంకా రాజీనామాలు చేయడం లేదు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే మన గ్రామానికి ప్రచారానికి వస్తున్నారు. ఈలోగా మీరు రాజీనామా చేయాలి. లేదంటే మేము ఏం చేయాలో అది చేస్తాం..' ఇదీ మండలంలోని వైసీపీ నేతల మాట. ఇవే మాటలు మండలంలోని లొట్లపల్లి పంచాయతీలో వినిపించాయి. దీంతో విధుల్లో ఇంకా కొనసాగుదాం అనుకున్న వలంటీర్లు తప్పనిసరి స్థితిలో బలవంతంగా రాజీనామాలు చేసి... గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేఖలు సమర్పించారు. ఇదేవిధంగా గోడుకొమ్ములోనూ హెచ్చరికలు రావడంతో వలంటీర్లు రాజీనామలు చేశారు. మూడు రోజుల క్రితం ఎస్.కోటలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు చిన్న శ్రీను వలంటీర్లతో రెండు రోజుల్లో రాజీనామాలు చేయించాలని ఎమ్మెల్యేతో పాటు మండలాల ముఖ్య నాయకులపై ఒత్తిడి తెచ్చారు. దీని ఫలితమే ఇదని అంటున్నారు. ఈ బలవంతపు రాజీనామాలపై గడిచిన ఐదేళ్లుగా సేవలు అందించిన వలంటీర్లు తీవ్రంగా మదన పడుతున్నారు. తాము రాజీనామలు చేయకుండా ఉంటే.. టీడీపీ ప్రభుత్వంలో నెలకు రూ.పదివేలు జీతం వచ్చేదని అంటున్నారు. తాము రాజీనామాలు చేయడం వల్ల ఆ అవకాశం కోల్పోతున్నామని సన్నిహితుల వద్ద వలంటీర్లు వాపోతున్నట్టు తెలిసింది.

ఒకటొకటిగా పథకాలు రద్దు


- బ్రాహ్మణులకు వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు

(గరుగుబిల్లి)

రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి.. అంతకుముందు టీడీపీ హయాంలో అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేస్తూ వచ్చింది. దీనివల్ల వివిధ సామాజిక వర్గాల వారితో పాటు వేలాది మంది లబ్ధిదారులు నష్టపోయారు.

- గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కొంతకాలంగా ఒకటొకటిగా వాటిని రద్దు చేయడం లేదా అమలు చేయకుండా కాలయాపన చేసింది.
- గత టీడీపీ హయాంలో బ్రాహ్మణ కుటుంబాల్లోని వృద్ధులకు కార్పొరేషన్ ద్వారా వృద్ధాప్య పింఛను లభించేది. ఒక కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు వృద్ధులు ఉన్నప్పటికీ అందరికీ పింఛను వచ్చేది.
- జగన్ ప్రభుత్వం ఒక కుటుంబంలో కేవలం ఒకరికే పింఛను అంటూ కోత పెట్టటమే కాకుండా ఆ ఒకరికి కూడా కార్పొరేషన్ ద్వారా కాకుండా సామాజిక పింఛను పథకానికి మార్పు చేశారు. ఈ క్రమంలో గతంలో పింఛను పొందుతున్న అనేకమంది బ్రాహ్మణ వృద్ధుల పేరు సామాజిక పింఛను పథకంలో కనిపించకుండా పోయి వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- గత టీడీపీ హయాంలో వయసుతో నిమిత్తం లేకుండా భర్తను కోల్పోయినా లేదా భర్త వదిలేసిన ఒంటరి బ్రాహ్మణ మహిళలకు సైతం నెలవారీ పింఛను కార్పొరేషన్ ద్వారా అందేది. వైసీపీ ప్రభుత్వ ఆ పింఛను సైతం నిలుపుదల చేసింది.
- విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే బ్రాహ్మణ విద్యార్థులకు కార్పొరేషన్ ద్వారా గతంలో ఆర్థిక సాయం అందేది. వైసీపీ ప్రభుత్వం దానిని సైతం నిలిపివేసింది.
- బ్రాహ్మణులు చనిపోయినప్పుడు అంత్యక్రియల ఖర్చుల కోసం గరుడ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేసే విధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న పది నుంచి పదిహేను రోజుల్లో రూ. 10 వేలు నేరుగా చనిపోయిన వ్యక్తి వారసులకు అందేవి.
- ప్రస్తుతం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుని జిల్లాలో అనేకమంది నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.
- కారు వంటి నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలు చేసుకుని దానిని అద్దెకు తిప్పటం ద్వారా స్వయం ఉపాధి పొందే విధంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ యువతకు రుణాలు ఇచ్చారు.
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అది అమలు కావటం లేదు. ఇలా అనేక పథకాలను నిలిపివేసింది.





సంపద సృష్టిస్తేనే అభివృద్ధి: అదితి



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న అశోక్, అదితీ గజపతిరాజు

విజయనగరం రూరల్: పరిపాలన అంటే సంపద సృష్టించి అభివృద్ధి చేయడ మని, అప్పులు చేయడం కాదని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి చిల్లపేట, సారిక, జొన్నవలస ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో వారిద్దరూ పాల్గొని మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం చేయ కుండా వదిలేశారన్నారు. పోలవరం పనులు 70 శాతం టీడీపీ హయాంలో జరి గితే, ఐదేళ్ల కాలంలో 30 శాతం పనులు కూడా పూర్తికాని పరిస్థితి ఏర్పడిందన్నారు. విజయన గరంలో ఎయిర్‌పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయం పరిస్థితి కూడా అదే వి ధంగా ఉందన్నారు. ప్రజలు ఆలోచించి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఎంతో మంది పిల్లలు విద్యకు దూరం అయ్యారన్నారు. విజయన గరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చంద్ర బాబు సూపర్ సిక్స్ హామీలను ప్రకటించారన్నారు. ఈ హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, అదే విధంగా సామాజిక పింఛన్ల పెంపు, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, తల్లికి వంద నం పేరిట చదువుకున్న పిల్లలకు ఏడాదికి రూ. 15 వేలు ఆర్థిక సాయం, రైతులకు ఆర్థిక చేయూత తదితర కార్యక్రమాలు ఉన్నాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు, అక్రమ కేసులు, రౌడీ యిజం, దౌర్జన్యం, విధ్వంసా లేనన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించడా నికే టీడీపీ, జనసేన, బీజేపీ సమష్టిగా పోరాడుతున్నాయన్నారు. ప్రజలంతా ఈ కూటమికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.

ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం: నాగమాధవి

డెంకాడ: మండలంలోని బంటుపల్లి, అక్కివరం, పినతాడివాడ, పెదతాడివాడ గ్రామాల్లో కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి ఆదివారం ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావుతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. వచ్చే ఐదేళ్లలో ఉద్యోగ కల్పనకు ప్రాధాన్య మిస్తున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు లేవనీ, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. కొత్త కంపెనీలు, పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడంలో జగన్ సర్కార్ విఫలమయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరూ గాజుగ్లాసుపై ఓటువేసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ నాగమాధవి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డెంకాడ మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనా రాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, మాజీ జడ్పీటీసీ కంది సూర్యనారాయణ, ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మిలక్ష్మీ, మాజీ ఎంపీటీసీ కె.ఆదిబాబు, పెదతాడివాడ, కూటమి నాయకులు చిరంజీవిరాజు, చింతపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న నాగమాధవి

సైకో పాలన పోవాలి: కోండ్రు



రాజాం: మాట్లాడుతున్న కోండ్రు మురళి

రాజాం రూరల్: జగన్‌రెడ్డి పాలనకు ప్రజలకు చరమగీతం పాడాలని తెదేపా రాజాం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనుకబడిపోయిందని, అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. సంతకవిటి మండలం మిర్తివలస, చిన మిర్తివలస, అప్పల అగ్రహారం, జానకీపురం, శేషాద్రిపురం, సిరిపురం, చిన్న సిరిపురం, బలరాంపేట, జగన్నాథపేట గ్రామాల్లో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్ప లనాయుడుతో కలిసి ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజలు అనుభవిస్తున్న ఇబ్బందులను తెలియజేశారు. బీసీ డిక్లరేషన్‌పై గ్రామాల్లో ప్రజలకు వివరించారు. చంద్రబాబుతోనే రాష్ట్రా భివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ప్రజల్ని కోండ్రు అభ్యర్థించా రు. తెదేపా, జనసేన, భాజపా మండల నాయకులు పాల్గొన్నారు.

రాజాం: విశ్వబ్రాహ్మణులకు తెలుగుదేశం పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని టీడీపీ నియోజక వర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ హామీఇచ్చారు. ఆదివారం శ్యాంపురం తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో విశ్వబ్రాహ్మణుల బీసీ సాధికార కమిటీ, జనసేన ఆత్మీయ సమావేశం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కోండ్రు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలతో విశ్వబ్రాహ్మణులకు ఎంతో మేలు జరగనుందన్నారు.

● తెదేపా యువ నాయకురాలు కావలి గ్రీష్మ సంతకవిటి మండలంలో ఆదివారం తళుక్కున మెరిశారు. తెదేపా రాజాం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

బెదిరింపులకు భయపడవద్దు: కలిశెట్టి



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల వద్ద కలిశెట్టి

రాజాం, మే 5: వైసీపీ ప్రలోభాలకు బెదిరింపులకు భయపడవద్దని, నిర్భయంగా పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలని విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడానికి వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేస్తారనే భయం వారిలో ఉందని, ఈ ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదన్నారు. వస్తున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఎక్కడికక్కడే పార్టీ నాయకులు కలిసి సక్రమంగా పోస్టల్ బ్యాలెట్ ఓటును ప్రతి ఉద్యోగీ వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు, పొట్నూరు చంద్రశేఖర్, జరజాన నీలయ్య, పొట్నూరు శేఖర్, పిల్లా సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: గరివిడిలోగల ఎస్‌పీఎస్ అటానమస్ డిగ్రీ కళాశాలలో చీపురుపల్లి నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం పరిశీలించారు. బ్యాలెట్ ఓట్లు కూటమికి ఎక్కువగా పడే విధంగా ప్రయత్నించాలని టీడీపీ నేతలకు సూచించారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,370 కాగా, తొలిరోజు ఆదివారం 385 ఓట్లు పోలయ్యాయి.

కూటమి గెలుపు ఖాయం: కళా

గరివిడి: రాబోయే ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మెరకముడిదాం మండలం రామయ్యవలస గ్రామంలో వైసీపీకి చెందిన శనపతి రాంబాబు, గేదెల ఆదినారాయణ, ఆబోతుల రాంబాబు తదితర 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనకు ఎక్స్‌పైరీ డేట్ వచ్చిందన్నారు. వైసీపీ ఓటమి తప్పదని, జగన్‌ను ఇంటికి పంపించే రోజులు వచ్చేశాయని అన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు తదితరులు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగా ర్జున అన్నారు. కూటమి అభ్యర్థి కళా వెంకటరావు తరపున ఆయన ఆదివారం కర్లాంలో ప్రచారం నిర్వ హించారు. ఈసందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీకి ఇవే చివరి ఎన్నికలన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పార్టీ నా యకులు మహంతి అప్పలనాయుడు, బాణాన రామకృష్ణంనాయుడు, కెల్ల రామారావు, దుగ్గు రామకృష్ణ, దుగ్గు మల్లేశ్వరరావు, సాంబ తదితరులున్నారు. జి. ములగాంలో జరిగిన ప్రచారంలో పార్టీ నాయకులు గంట్యాడ సత్యనారాయణ, గడే సన్యాసప్పల నాయుడు, ఆలమండ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గరివిడి: టీడీపీలో చేరిన వారితో కళా వెంకటరావు

యూటీఎఫ్ నేత శేషగిరి వర్ధంతి



ఎస్.కోటలో యూటీఎఫ్ నేత శేషగిరికి నివాళులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో యూటీఎఫ్ నేత కామ్రేడ్ శేషగిరి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలకోసం అలుపెరగని పోరాటం చేశారని యూటీఎఫ్ నాయకులు జీ.వి.రమణ, గేదల బంగారు నాయుడు కొని యాడారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.వి.ఎస్ నారాయణ, ఆశపు శ్రీనివాస్, ఎం.కొండలరావు, జె.శ్రీరామూర్తి, సీహెచ్ సర్వదేముళ్ల తదితరులున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సింగిడి అప్పయ్యమ్మ(70) పదిరోజుల క్రితం గ్రామం నుంచి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ వృద్ధురాలు పదిరోజుల క్రితం ఎస్.కోట సామాజిక ఆసుపత్రికి వెళ్లి అప్పటినుంచి కనిపించడంలేదని, దీంతో అన్ని చోట్ల వెతికి శృంగవ రపుకోట పోలీసులకు ఫిర్యాదుచేశామని తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9381189100కు తెలియజేయాలన్నారు.

పిల్లల్లో భక్తిభావం నింపాలి

రేగిడి: భగవాన్ సాత్యసాయిబాబా ఆశయాలు, సేవాతత్పరత పిల్లలకు స్ఫూర్తి కావాలని ఏపీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త తోట అరుణకుమారి అన్నారు. మండలంలో రేగిడి విశ్వసాయి మందిరంలో నిర్వహిస్తున్న సత్యసాయి వేసవి వెన్నెల తరగతుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వసాయి మందిరం సాయికీర్తనలతో మార్మోగింది. రేగిడి మందిర ధర్మకర్త హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలరావు, రాజాం డివిజన్ సత్యసాయి జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, సాయికమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు

శృంగవరపుకోట రూరల్: ఇవే వైసీపీకి చివరి ఎన్నికలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఇందుకూరి సుధా రాజు అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురం, గోపాలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. గోపాలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామవార్డుసభ్యుల తో పాటు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

జామి: మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన వైసీపీ కీలక నేతలు గజపతినగరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కేఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చేరారు. మండలపార్టీ అధ్యక్షుడు కొత్తలి స్వామినా యుడు ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి.

సూపర్‌సిక్స్ హామీలపై ప్రచారం

రేగిడి: రాజాం నియోజకవర్గంలో టీడీపీ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన సుపర్‌సిక్స్ హామీలు ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నాయి. గ్రామగ్రామాన పార్టీ దిగువశ్రేణి క్యాడర్ ఇంటింటికీ వెళ్లి టీడీపీ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మండలంలో సంకిలి గ్రామంలో తెలుగుయువత ఆధ్వర్యంలో పొందరవీధి, దళితులకాలనీ, ప్రధానవీధుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కర్రి రమణ, గుండ దామోదర్, బగ్గు పట్టాభినాయుడు, బాన్న హరినాథ్ తదితరులు ఉన్నారు. ● **బాడంగి:** మండలంలోని కోడూరు మధుర గ్రామమైన అచ్చంపేట, గొల్లలపేట గ్రామాల్లో జిల్లా టీడీపీ బీసీ సాధికారిక కమిటీ ఛైర్మన్ కొల్లి అప్పలనాయుడు ఆదివారం ప్రచారం నిర్వహించారు. బేబీనాయనను గెలిపించాలని కోరారు. మరిపి రమేష్, లచ్చుపతుల సత్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** మండల పరిధిలోని వంగపండువలస గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్‌పై రొంపల్లి ఎంపీటీసీ, తెలుగుదేశం యువనాయకుడు భవిరెడ్డి శంకరరావు ప్రచా రం నిర్వహించారు. రానున్న ఎన్నిక ల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ● **లక్కవరపు కోట:** మండలంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఉదయం మండల పార్టీ నేతలతో కలిసి నాయుడుపేట, గొల్జాం, కిత్తన్నపేట గ్రామాల్లో, సాయంత్రం కొత్తగంగుబూడి, గజపతినగరం, గంగుబూడి, శ్రీరాంపురం, తామరాప ల్లి, కోనమసివానిపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా జనసేన సైకిల్ ర్యాలీ

బొబ్బిలి: టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి మద్దతుగా జనసేన రాష్ట్రపార్టీ కార్యక్రమాల నిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి బొబ్బిలి పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వ హిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఐటిఐ కాలనీ, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలలో ప్రచా రం నిర్వహించారు. జనసేన నాయకులు సంచాన గంగాధర్, దిబ్బ కళ్యాణ్, టీడీపీ నాయకులు బొద్దాన అ ప్పారావు, చంద్రశేఖర్, తదితరులున్నారు

రేపు బొబ్బిలిలో టీడీపీ దివ్యాంగ సమావేశం

బొబ్బిలి: సిరిపురపు వీధిలో మంగళవారం ఉదయం దివ్యాంగులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్రకార్యదర్శి చీమల రాంబాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఈ నెల 7న బొబ్బిలిలో నిర్వ హించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొంటారని, ఈ సమావేశానికి దివ్యాంగులంతా హాజ రు కావాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన బేబీనాయన, కలి శెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బేబీనాయన ప్రచారం

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎన్‌డీఏ తరపున పోటీ చేస్తున్న బేబీనాయన ఆదివారం బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల కాలనీ, సాయినగర్, తారకరామాకాలనీ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకోవడం చారిత్రక అవసరమన్నారు. ● **రామభద్రపురం:** ఈ రాష్ట్రానికి చంద్రబా బు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని బొబ్బిలి కూటమి అభ్యర్థి బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని పాతరేగ, కొత్తరేగ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల శంఖారావ సభ నిర్వహించారు. మాజీ ఎమ్మె ల్యే తెంటు లక్ష్మంనాయుడు, జనసేన నాయకులు పాలూరు బాబు, టీడీపీ నాయకులు మడక తిరుపతినా యుడు తదితరులున్నారు.

టీడీపీ జెండా ఎగరేస్తాం

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి కోటపై టీడీపీ జెండా ఎగరడం కాయమని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు జోష్యం చెప్పారు. మండల పరిధిలోని కొత్తరేగ గ్రామంలో ఆదివా రం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. నియోజవకవర్గ అభివృద్ధికి బొబ్బిలి రాజులు చేసిన సేవలే ఆయన గెలుపు నకు సోపానాలన్నారు. నాయకులు కూనిశెట్టి భాస్కరరావు, వంగపండు అప్పలనాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

గజపతినగరం: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డోల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువచ్చే దిశగా కృషి చేస్తామన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి, తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు పురం అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకుడు హనీష్ ఛోబ్రా

గజపతినగరం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎం ఓటింగ్ యంత్రాల పనితీరును ఎన్నికల పరిశీలకుడు హనీష్ ఛోబ్రా పరిశీలించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలతో పాటు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల యంత్రాలను ఏవిధంగా పొందు పరు స్తున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్‌కు చేసిన ఏర్పాట్లు ఓటింగ్ ప్రక్రియ, హెల్ప్ డెస్కులు, పోలింగ్ బూత్‌లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్వో ఎం.సూర్యకళ, తహసీల్దార్ సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత వాహన తనిఖీలు



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైం, మే 5: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దీపికా ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు జిల్లా వ్యాప్తంగా ఎస్పీ దీపికా ఆదేశాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై 140 మందిపై కేసులు నమోదు చేశారు. పోలింగు కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించి పంపిస్తు న్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవా లని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. నగర శివార్ల లోని వీటి అగ్రహారం, మోదవలస, జమ్మునారాయణపురం, నెల్లిమర్ల మిమ్స్, ఎస్‌కోట, గజపతినగరం రహదారుల్లో తనిఖీల కేంద్రం ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని పరిశీలించి రికార్డులో నమోదు చేసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి పెండింగ్ ఈ చలానాలను చెక్ చేసి పెండింగ్ ఉంటే చెల్లించిన తరువాతనే వాహనాలను వదిలిపెడుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రెండో మేజర్ పంచాయతీ ధర్మవరం ఎస్సీకాలనీ, తదితర ప్రాంతాల్లో పేరుకు పోయిన పారిశుధ్యంను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు. గడిచిన పదిరోజులుగా పంచాయతీ సర్పంచ్, ఈవోలకు చెప్పినా వారు పట్టించుకోలేదని, వ్యాధులు కు వ్యాపిస్తాయన్న భయంగా ఉందని పేర్కొన్నారు.

ధర్మవరం గ్రామంలో పారిశుధ్యం దుస్థితి



ఓటర్లకు అవగాహన

చీపురుపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మెట్టపల్లిలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ ర్యాలీలో సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి



గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు శ్రీనివాస్, రాకోటి రాములు మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ భౌతికంగా లేనప్పటికీ ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకుపోయేవారిలో సజీవంగానే ఉన్నారన్నారు. హరికృష్ణ, వేణి, రాము పాల్గొన్నారు.

అక్కసుతో మోటార్ వైర్లను తొలగించారు

బొబ్బిలి: ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామస్థులంతా బేబీనాయనపై అభిమానంతో వ్యవహరిస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేని ప్రత్యర్థులు బేబీనాయన ఏర్పాటు చేసిన తాగునీటి బోరుబావికి గల విద్యుత్ మోటారు వైర్లను తొలగించారని స్థానిక టీడీపీ నాయకులు ఆరోపించారు. గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు గొట్టాపు సత్యనారాయణ, మాజీ పాఠశాల కమిటీ ఛైర్మన్ ఆవాల పాపారావు ఆదివారం స్థానిక దర్బారు మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో తొమ్మిదేళ్ల క్రితం బేబీనాయన సొంతనిధులతో తాగునీటి బోర్లు, మోటార్లను ఏర్పాటు చేశారు. దీనితో గ్రామస్థులంతా ఆయనను ఎంతగానో అభిమానిస్తున్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రత్యర్థులు మోటార్ వైర్లు కట్ చేయడమే కాకుండా విద్యుత్ స్విచ్‌బాక్స్‌ను ముట్టుకుంటే కరెంట్ షాక్ తగిలే విధంగా ఫ్యూజ్ వైర్లను కలిపేశారన్నారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగానే మోటారును ఆన్ చేయడానికి వెళ్లిన స్విచ్ ఆపరేటర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పినట్లయిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేస్తున్నామని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ, పాపారావు డిమాండ్ చేశారు.

ప్రచారంలో అశోక్ చిన్న కుమార్తె



అశోక్ చిన్నకుమార్తె విద్యావతీ దేవి ఎన్నికల ప్రచారం

విజయనగరం రూరల్: టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు చిన్నకుమార్తె విద్యావతీదేవి(హైదరాబాదు) ఆదివారం ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడుకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. 44వ డివిజన్ పరిధిలోని అయ్యన్నపేట, రాయివీధి, చిన్నవీధి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, తుమ్మగంటి వారు వీధి, మంగళవీధి, కొత్తవాస వీధి తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఆమెకు ఆ ప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడులను గెలిపించాలని ఆమె కోరారు. ● ఈ నెల 7న 13వ డివిజన్‌లోని కొత్తపేట, యాదవ వీధిలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు సమాచారం అందడంతో ఆమె పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను డివిజన్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

టీడీపీలోకి 200 చేనేత కుటుంబాలు

రాజాం: రాజాం పురపాలక సంఘం పరిధిలోని 200 చేనేత కుటుంబాలు వైసీపీ పార్టీని వీడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సమక్షంలో ఆదివారం రాత్రి శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సంఘం నాయకులు నల్ల శ్రీనివాసరావు సమక్షంలో వారు టీడీపీ కండువా వేసుకున్నారు. కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.